

# కమిటీ సభ్యులపై ఆరోపణలు చేస్తే సహించేది లేదు

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుర్నూలే నారాయణ**

**ఉద్యమ కెరటం, వాంకిడి:** ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులపై బీజేపీ నాయకులు అసత్యపు ఆరోపణలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుర్నూలే నారాయణ హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ళను ఇస్తుంటే, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎలగతి సుచిత్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు డబ్బులు ఇచ్చిన వారికే ఇల్లు ఇచ్చారని, నిరుపేదలకు అన్యాయం జరిగిందని, మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని సవాల్ చేయడంతో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సవాల్ ను స్వీకరిస్తూ పార్టీ కార్యాలయంలోనే ఎదురుచూస్తుంటామని ఎద్దేవా చేశారు. ఇలాంటి పిచ్చి సవాళ్లు చేస్తూ కమిటీ సభ్యులపై ఆరోపణలు చేస్తే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని బీజేపీ నాయకులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ జిల్లా అధ్యక్షులు మెంగజీ, పట్టణ అధ్యక్షులు మండోకర్ అనిల్, నాయకులు కృష్ణ, పాండు, పెంటు, రమేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్ట్లకు భయపడం

**బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి ఏల గతి సుచిత్**



**ఉద్యమ కెరటం, వాంకిడి:** బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి ఏలగతి సుచిత్ తో పాటు బీజేపీ నాయకులను వాంకిడి మండల కేంద్రంలో మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా సుచిత్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ వాంకిడి శాఖ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్లల్లో జరిగిన అవకతవకల గురించి కాంగ్రెస్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం ఉండడంతో పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం వాళ్ళ చేతిలో ఉందని అనర్హులకు ఇల్లు ఇచ్చి, పేద ప్రజలకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులకు పోలీసులు వత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. పోలీస్ స్టేషన్ కు తరలించిన వారిలో మండోకర్ వికాస్, దుర్గం అక్షయ్, గణేష్, అవినాష్ తదితరులు ఉన్నారు.

# బాధితులు అధైర్య పడొద్దు..

**కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంఛార్జి ఆడే గజేందర్**



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో పంటలు, ఇండ్లు నష్టపోయిన బాధితులు అధైర్య పడొద్దని, ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంఛార్జి ఆడే గజేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని కుప్టి గ్రామంలో పర్యటించి భారీ వర్షాల కారణంగా నష్టపోయిన పంటల పొలాలు, దెబ్బతిన్న ఇండ్లను పరిశీలించారు. బాధితులకు ధైర్యం కల్పించి, ప్రభుత్వం నుంచి ఆదుకుంటామని భరోసా కల్పించారు. అధికారులతో మాట్లాడి నష్టపోయిన రైతుల వివరాలు, దెబ్బతిన్న ఇళ్ల వివరాలు పక్కగా నమోదు చేయాలని సూచించారు. అదనపు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఆడే వసంత్ రావు, సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డి, ఆత్మ డైరెక్టర్ కుంట శంకర్, నాయకులు నాయిడి రవి, నారాయణ, షేక్ అలీ, ఎండీ సద్దాం, జాదవ్ కపిల్, పాల శంకర్, ఇసాఖ్ తదితరులు ఉన్నారు.

# నష్టపోయిన పంటల పరిశీలన

**ఉద్యమ కెరటం, దహెగాం:** దహెగాం మండలంలోని ఖర్జీ, గిరవెల్లి గ్రామాల్లో వరద నీటికి నష్టపోయిన పంటలను మంగళవారం వ్యవసాయ విస్తరణ అధికారి సుష్మిత పరిశీలించారు. వరద ధాటికి నష్టపోయిన, నల్లబారిపోయిన పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. పంట నష్ట పరిహారం అందేవిధంగా చూస్తామని పేర్కొన్నారు. ఆమె వెంట రైతులు, తదితరులు ఉన్నారు.



# విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



- జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు
- హేమన్ డార్ఫ్ కు ఘన నివాళి
- వసతి గృహంలో విద్యార్థులతో కలిసి జిల్లా ఇన్చార్జి మంత్రి నిద్ర

**ఉద్యమ కెరటం, జైనూర్ ( మార్లవాయి ) :** ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ నెల 20 వ తేదీన జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం రాత్రి మొదటిసారిగా జిల్లాకు విచ్చేసిన జిల్లా ఇన్చార్జి మంత్రి జిల్లాలోని జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల వసతి గృహంలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే , కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వసతి గృహ నిద్ర చేశారు. అంతకముందు హేమన్ డార్ఫ్ విగ్రహాలకు పూలమా లలు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, అదనపు గదులు ఇతర సకల సదుపాయాలు కల్పించి కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో నిష్ణాతులైన ఉపాధ్యాయుల నియామకం చేపట్టి విద్యా వ్యవస్థను పటిష్ట పరచడం జరిగిందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 40 శాతం డైట్, 200 శాతం కాస్మోటిక్ చార్జీలను పెంచి విద్యార్థులకు అందించడం జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా శుద్ధమైన త్రాగు నీటిని అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో అభివృద్ధి పనులు చేపట్టి విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి చేయడం జరిగిందని, విద్యార్థులకు పాఠశాల ప్రారంభం రోజునే నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, ఒక జత ఏకరూప దుస్తులను అందించడం జరిగిందని తెలిపారు. బడి బయట ఉన్న బడి వయసు పిల్లలు, మధ్యలో బడి మానివేసిన పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండల విద్యాధికారులు, పాఠశాలల సముదాయాల ప్రధానోపాధ్యాయుల సమన్వయంతో ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు కావలసిన సదుపాయాలు సమకూర్చడంతో పాటు ఆయా పాఠశాలలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా అధికారులు తమ పరిధిలోని పాఠశాలలు, వసతి గృహాలను సందర్శించి రాత్రి బస చేసి, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా సమయానుసారంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అంతకు ముందు జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర మంత్రికి జిల్లా కలెక్టర్, ఎస్.పి. కాంతిలాల్ సుభాష్ తో కలిసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ , కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి అజ్మీరా శ్యాం నాయక్ , కాంగ్రెస్ పార్టీ కిసాన్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీనివాస్ రెడ్డి , సంబంధిత అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# న్యాయవాదిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవడం లేదు

**తప్పుడు కేసు నమోదు చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి**

**తప్పుడు కేసును కొట్టివేయాలి**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** న్యాయవాది నరహరిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా న్యాయవాదికి భయభ్రాంతులకు గురిచేయాలని అట్రాసిటీ తప్పుడు కేసు నమోదు చేయడం ఏమిటి అని ఆసిఫాబాద్ సీనియర్ న్యాయవాదులు ముక్త సురేష్, బోనగిరి సతీష్ బాబు, జే శ్యాం కుమార్ , నికోడి రవీందర్ , ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మంతెన చరణ్ తేజ , సిర్పూర్ బారసోసియేషన్ అధ్యక్షుడు భావనపల్లి శ్రీనివాస్ లు మండిపడ్డారు. మంగళవారం న్యాయవాదిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, తప్పుడు కేసు నమోదు చేసిన ఎస్ఐ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ న్యాయవాదులు జస్టిస్ భీమపాక నగేష్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదిపై జరిగిన దాడికి నిరసనగా వారం రోజుల పాటు న్యాయవాదులు చేస్తున్న ఆందోళనకు జిల్లా పోలీసు అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. న్యాయవాదిపై దాడి చేసిన దుండవులతో స్థానిక పోలీసులు కుమ్మక్కై న్యాయవాదిపై, అతని అన్నపై అట్రాసిటీ కేసు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. న్యాయవాదికి న్యాయం జరగకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో న్యాయవాదులు గుండారాపు గణపతి, కొమురం లాల్షా , మునీర్ అహ్మద్ , బూసి రాజ్ కుమార్, రామకృష్ణ, జాడి విద్యాసాగర్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి



**కడెం ప్రాజెక్టును పరిశీలించిన జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు**

**వరదలపై సమీక్ష సమావేశం**

**ఉద్యమ కెరటం, కడెం:** కడెం ప్రాజెక్టును ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావ్ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తో కలిసి మంగళవారం పరిశీలించారు. వరద తీవ్రతకు నీటిలో కొట్టుకుపోయిన కుటుంబాలను ఆదుకుంటామని, వరదల వల్ల నష్టపోయిన ప్రజలకు అండగా ప్రభుత్వం ఉంటుందని తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రభావితమైన ప్రాంతాలను పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను సూచించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు ప్రజలకు 24గంటలు అందుబాటులో ఉండాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రజల సమస్యలు తీరుతాయని పేర్కొన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని లోతట్టు ప్రాంతాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా కలెక్టర్, ఎస్పీ, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండల కేంద్రంలోని ఐబీలో మంగళవారం 186వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని తాండూర్ మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షులు సబ్బని సమ్మన్న, ప్రధాన కార్యదర్శి పుప్పాల శోభన్, కోశాధికారి రమేష్, మాజీ అధ్యక్షులు కృష్ణమూర్తి, ఎస్ కే మోహిన్, పుప్పాల సురేష్, రంజిత్, దుర్గాప్రసాద్, షారుక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# చదువు చెప్పాలంటే.. ఒర్రె దాటాల్సిందే

**ఉద్యమ కెరటం, దహెగాం:** పాఠశాలకు వెళ్లి పిల్లలకు చదువు చెప్పాలంటే ఒర్రె దాటాల్సిందే.. దహెగాం మండలంలోని పెసరికుంట గ్రామపంచాయతీలో గల మురలీగూడ గ్రామంలోకి వెళ్లాలంటే ప్రమాదకర ఒర్రె దాటి వెళ్ళాలి. ఉపాధ్యాయుడు ఆ గ్రామంలోని పాఠశాలకు రోజూ ఇలానే ఒర్రె దాటి వెళ్తున్నాడు. ఎక్కువ వర్షం పడ్డ, ఒర్రె దాటితూ అద మరిచిన అంతే సంగతులు. ఆ గ్రామంలోని ప్రజలు నిత్యావసరాలకు మండల కేంద్రానికి వెళ్లాలంటే ఒర్రె దాటాల్సిందే. వర్షం ఎక్కువ పడితే భారీగా నీరు చేరి ప్రమాదకరంగా మారుతుంది. ఏళ్లుగా ఇదే సమస్య ఉందని, ఒర్రె ఎక్కువ వస్తే ఎటు వెళ్లలేని పరిస్థితి అని, ఎన్నికలప్పుడు రాజకీయ నాయకులు వచ్చి చూసి వెళ్ళిపోతారని, పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు సమస్య విన్నవించినా ఎవరు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోయారు. ఒర్రె వద్ద బ్రిడ్జి నిర్మించి మా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.





### వంతెన నిర్మించాలి..

మేము ఎటు వెళ్లాలన్నా, నిత్యావసర సరుకులు తెచ్చుకోవాలన్నా చాలా ఇబ్బందిగా ఉంది. ఒర్రెను ప్రమాదకరంగా దాటుతున్నాం. వరద ఎక్కువైతే ప్రమాదాలు జరుగుతాయి. మా సమస్యను పరిష్కరిస్తూ ప్రభుత్వం ఒర్రెపై వంతెన నిర్మించాలి.

- కుమురం బాలక్క, గ్రామస్థురాలు



### సమస్యను పరిష్కరించండి

- కుమురం గణేష్, గ్రామ యువకుడు

మేము నిత్యం మండల కేంద్రానికి వెళ్తుంటాం. నిత్యావసర సరుకుల కోసం, వ్యవసాయ పనుల నిమిత్తం ఒర్రె దాటాల్సి ఉంటుంది. ఒర్రె వరద దాటడం చాలా ప్రమాదకరం. ఆస్పత్రికి వెళ్లాలన్న చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. గ్రామ సమస్య ను పరిష్కారించాలని ప్రజా ప్రతినిధులను, అధికారులను కోరుతున్నాం.

# పీహెచ్‌సీ ఎదుట ధర్నా

ఉద్యమ కెరటం, తాండూర్: రాష్ట్ర వ్యాప్త పీహెచ్‌సీల ముందు ధర్నాల్లో భాగంగా మంగళవారం తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మండల ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి డి రాజా రామ్ మాట్లాడుతూ తెలంగాణ ఆశా వర్కర్స్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ హెచ్ పి లక్ష్మి ప్రసన్నకు వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ఈనెల 25న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాల్లో భాగంగా మంచిర్యాల కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నాలో పాల్గొంటామని తెలిపారు. సెప్టెంబర్ 1న చలో హైదరాబాద్ కు తరలివెళ్తామని అన్నారు. ఫిక్స్ వేతనం నెలకు రూ.18వేలు చెల్లించాలని, సీనియార్టీ ప్రతిపాదికన ఆశ వర్కర్లను ఏఎన్ఎంలుగా పదోన్నతి కల్పించాలి, పెండింగ్ లో ఉన్న పారితోషికాలు వెంటనే చెల్లించాలి, ప్రతి నెల వేతనం ఒకటవ తారీఖున చెల్లించాలి, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఆశా వర్కర్లు కవిత, రాజేశ్వరి, సావిత్రి, సునీత, భాగ్య, చంద్రకళ, భారతి, అనురాధ, జయ, మల్లేశ్వరి, లక్ష్మి, సంధ్యారాణి, నర్సు బాయి, మంజుల, కార్మికులు పాల్గొన్నారు.




# పథకాలు అర్హులైన గిరిజనులకు అందించాలి

### జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన గిరిజనులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ధర్తీ అభజన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్, ఆది ఖర్మ యోగి అభియాన్ కార్యక్రమంలో భాగంగా సంబంధిత శాఖల అధికారులు, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లతో నిర్వహించిన సమావేశానికి హాజరయ్యా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి జూగా పథకం లో భాగంగా ఆది కర్మ యోగి కార్యక్రమాల ద్వారా జిల్లాలోని 12 మండలాల్లో గల 102 గ్రామాల్లో ఉన్న గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే సంక్షేమ పథకాలు ప్రతి గిరిజన కుటుంబానికి చేరే విధంగా బ్లాక్ స్థాయి (మండల) మాస్టర్ ట్రైనర్లు, గ్రామస్థాయి శిక్షకులు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. మిషన్ భగీరథ, గిరిజన సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, వైద్య ఆరోగ్య, అటవీ, విద్య, శిశు సంక్షేమ శాఖల నుంచి బ్లాక్ స్థాయి ట్రైనర్లు, పంచాయితీ స్థాయి సిబ్బందిని ఎంపిక చేయాలని పేర్కొన్నారు.



శిక్షణ అనంతరం జిల్లాలోని 12 మండలాల్లోని 102 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, కార్యాచరణ రూపొందించాలని, ప్రతి గ్రామంలో నిర్వహించే గ్రామ సభలో గ్రామాల్లో పనిచేసే ప్రతి శాఖకు సంబంధించిన సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి గ్రామ సభలో ముఖ్యంగా పంచాయితీ రాజ్, వైద్య ఆరోగ్య, గ్రామీణ అభివృద్ధి, విద్యుత్, విద్యా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, విద్యుత్ ఎస్ఈ శేష రావు, పంచాయతీరాజ్ ఈఈ కృష్ణ, మిషన్ భగీరథ ఈఈ సిద్ధిక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, జిల్లా పరిషత్ ముఖ్యకార్య నిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, పర్యటకశాఖ అధికారి అశోక్, మాస్టర్ ట్రైనర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# సర్దార్ సర్వాయి పాపన్న జయంతి

**ఉద్యమ కెరటం, తాండూర్:** సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను మంగళవారం తాండూర్ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం మండల మోకుదేబ్బ నాయకులు, వివిధ పార్టీల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బహుజనుల కోసం చేసిన పోరాటాన్ని కొనియాడారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మోకు దెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి భూసారపు మొండిగౌడ్, రాష్ట్ర నాయకులు తాళ్లపల్లి శంకర్ గౌడ్, జిల్లా కార్యదర్శి పి భాస్కర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి బి పున్నం గౌడ్, చీకటి వెంకటేష్ గౌడ్, చీకటి మొండి గౌడ్, రవి గౌడ్, గాజుల రమేష్ గౌడ్, మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎస్ రవీందర్ రెడ్డి, తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి ఈసా, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పులగం తిరుపతి, మాజీ ఎంపీపీ ఎస్ శంకర్, బీఆర్ఎస్ నాయకులు ఎం శ్రీరాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పుట్ట శ్రీనివాస్, చొప్పదండి నరేష్, చీర్ల రాజేశం, నవీన్ కుమార్ లతో పాటు గౌడ సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


# ముంచిన ప్రాణహిత బ్యాక్ వాటర్




**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాణహిత నది ఉప్పొంగి ప్రవహిస్తుంది. మంగళవారం మండలంలోని తలాయి, సోమిని, మోగవెల్లి, నాగేపల్లి తదితర గ్రామాల్లో ప్రాణహిత బ్యాక్ వాటర్ తో పంట పొలాలు పూర్తిగా మునిగాయి. ఇలా వరద బ్యాక్ వాటర్ తో పంట పొలాలు మునగడం ఇది రెండవసారి అని, ఒకే సంవత్సరంలో ఇలా వరద ఉధృతి వచ్చినప్పుడు బ్యాక్ వాటర్ తో పంటలు పదేపదే మునిగిపోయి రైతులు తీవ్ర నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని సంవత్సరాలుగా పంట నష్టపోయిన ఎన్నడూ వచ్చి అధికారులు నష్టపోయిన పంటలను పరిశీలించిన దాఖలా లేదని, సర్వే చేసి రైతులకు పరిహారం అందించిన దాఖలాలు లేవని అన్నారు. ప్రజా పాలనలో ఈ ప్రభుత్వమైనా ప్రాణహిత పరివాహక ప్రాంత రైతుల అవస్థలను అర్థం చేసుకొని నష్టపోయిన పంటలను సర్వే చేయించి పరిహారం అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.



# కంటెయినర్ బోల్తా .. డ్రైవర్ మృతి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని కుప్టి గ్రామ సమీపంలో నాలుగు వరుసల జాతీయ రహదారి 44పై కడెం వాగు బ్రిడ్జి పైనుంచి వాహనం బోల్తా కొట్టి కింద పడడంతో డ్రైవర్ మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాగ్ పూర్ నుంచి హైదరాబాద్ వైపు పార్సల్ లోడ్ తో వెళ్తున్నఐచర్ కంటెయినర్ (ఎంహెచ్ 40సీడీ 1838) వాహనం మండలంలోని కుప్టి గ్రామ సమీపంలో బ్రిడ్జి వద్ద అదుపుతప్పి బ్రిడ్జి పైనుంచి కింద పడింది. దీంతో డ్రైవర్ అనువతే అనిల్ (38) క్యాబిన్ లోనే ఇరుక్కొని మృతిచెందాడు. సమాచారం అందుకున్న సీఐ బండారి రాజు, ఎస్సై ఇమ్రాన్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని క్రేన్ సహాయంతో బయటకు తీశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# 21, 22 తేదీల్లో జాతీయ లోక్ అదాలత్ సన్నాహక సమావేశాలు

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ రమేష్

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారం కోసం సెప్టెంబర్ 13వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ సన్నాహక సమావేశం ఈనెల 21వ తేదీ సాయంత్రం 5 గంటలకు పోలీసు శాఖ అధికారులకు, 22వ తేదీ సాయంత్రం 5 గంటలకు బార్ అధ్యక్షులు, అసోసియేషన్ సభ్యులు, పానల్ అడ్వకేట్లు, బీమా సంస్థల ప్రతినిధులతో జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థానం భవనంలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ లో క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్, బ్యాంకింగ్, విద్యుత్, భూ సమస్యల కేసులు, వివాహం, కుటుంబ కలహాల కేసులు, మోటార్ వెహికల్ ప్రమాద కేసులు, ఎన్ఐ యాక్, చిట్ ఫండ్, చెక్ బౌన్స్ కేసులతో పాటు ఇతర కాంపౌండబుల్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించేందుకు అందరూ సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

# విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

## అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ రూరల్:** విద్యారంగ అభివృద్ధి దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలను సందర్శించారు. తరగతి గదులు, రిజిస్టర్లు, ప్రయోగశాల, వంట శాల, పారిశుద్ధ్య నిర్వహణ అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం సకల సదుపాయాలు కల్పించి నిష్ణాతులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులను వినియోగించాలని, శుద్ధమైన తాగునీటిని అందించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, వర్చువల్ రియాలిటీ పద్ధతిలో విద్యార్థులకు బోధించాలని పేర్కొన్నారు. పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, వర్షాకాలం కావడంతో వ్యాధుల వ్యాప్తిని నిరోధించే విధంగా వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు వివరించాలని తెలిపారు. పాఠశాలలో చేపట్టాల్సిన మరమ్మత్తులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం జనకాపూర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి రిజిస్టర్లు, విద్యార్థుల హాజరు, విద్యా బోధన, మధ్యాహ్న భోజనం అంశాలను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని భవిత కేంద్రాన్ని సందర్శించి రికార్డుల పరిశీలన, విద్యార్థుల నమోదు వివరాలతో పాటు నూతనంగా నిర్మిస్తున్న భవిత కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు భవిత కేంద్రం ద్వారా విద్యా బోధన చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంచార్జ్ మంత్రికి ఘన స్వాగతం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నష్టపోయిన పంటలను, ఇళ్లను పరిశీలించడానికి వచ్చిన జిల్లా ఇంచార్జి రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణరావ్ ను మంగళవారం మండలంలోని రోల్ మామడ టోల్ ప్లాజా వద్ద కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువతో సత్కరించారు. అనంతరం బోథ్ నియోజకవర్గంలో తాజా పరిస్థితులపై జిల్లా ఇంచార్జ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పంట, ఆస్తి నష్టాన్ని లిఖితపూర్వకంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన మంత్రి జూపల్లి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని, లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన లాండే దత్తు గత 27న భోరజ్ మండలంలోని తరోడా వంతెనను దాటడానికి ప్రయత్నిస్తుండగా నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి దుర్మరణం చెందాడు. ఈ విషాద సంఘటనపై కలెక్టర్ రాజర్షిషా ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ప్రభుత్వం ఈ అంశాన్ని పరిశీలించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా బాధితుడి భార్య ఎల్ జ్యోతికి మంజూరు చేసిన రూ.5లక్షల ఆర్థిక సహాయంగా చేసిన చెక్కును మంగళవారం ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తో కలసి అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ ఆర్థిక సహాయం వారి జీవితంలో కొంత ఉపశమనాన్ని కలిగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# హస్తం గూటికి బీఆర్ఎస్ నాయకులు

**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** గుడిహత్నూర్ మండలంలోని మచ్చపూర్, కొలంగూడా గ్రామానికి చెందిన దాదాపు 30 మంది కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం నేరడిగొండ మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో వారికి ఆడే గజేందర్ కండువాలు కప్పి సాధారణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ లో చేరిన వారు మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గంలో ఆడే గజేందర్ తోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదవారికి చేరుతున్నాయని, అందుకే కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని పేర్కొన్నారు. చేరిన వారిలో జైవంత్ రావు, లేద్దిరాం, సీతారాం, ఆనంద్ రావు , అయు పటేల్, రాజ్ కుమార్, భీంరావు, జంగు సురేష్ తో పాటు దాదాపు 30 మంది చేరారు. అనంతరం ఆడే గజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పనిచేయాలని, స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగర వేయడమే లక్ష్యంగా ముందుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆడే వసంతరావు, సీనియర్ నాయకులు రాథోడ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.





# జిల్లా ఇంచార్జ్ మంత్రికి సుగుణ, బోరంచు ఘన స్వాగతం

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** వరద ముప్పు ప్రాంతాలను సందర్శించడానికి మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావును మావల బైపాస్ వద్ద టీపీసీసీ ఉపాధ్యక్షులు ఆత్రం సుగుణ, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భారీ వర్షాలతో జిల్లాలో జరిగిన నష్టాల గురించి మంత్రికి వివరించారు. పలు కాలనీల్లో వరదనీరు ఇళ్లల్లో చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అటు రైతులు చేలల్లోకి వరదనీరు చేరి పంటలు తీవ్రంగా నష్టపోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మావల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కుదురుపాక సురేష్, సీనియర్ నాయకులు రేండ్ల రాజన్న, అఫ్సర్ ఖాన్, అలీం ఖాన్, సమీ ఉల్లా ఖాన్, సంతోష్, గోవింద్, అక్షయ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర మంత్రి రాక



**ఉద్యమ కెరటం, దహెగాం:** రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ, ఉమ్మడి జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు కుమురం భీం జిల్లా దహెగాం మండలంలోని ముంపు ప్రాంతమైన పెసరి కుంట గ్రామాన్ని బుధవారం సందర్శించనున్నారు. అనంతరం జిల్లా కాలెక్టరేట్ లో వరదల ప్రభా వం, జిల్లా అభివృద్ధి పై సమీక్షా నిర్వహించనున్నారు.



# భీమన్నవాగుపై వంతెన నిర్మించాలి

**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండలం నర్సాపూర్ గ్రామపంచాయతీలోని ప్రధాన రహదారి అయిన భీమన్న వాగుపై హై లెవెల్ వంతెన నిర్మించాలని భారతీయ జనతా పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మామిడి విఘ్నేష్ డిమాండ్ చేశారు. మంగళవారం భీమన్న వాగుపై ఉన్న వంతెనను పార్టీ నాయకులతో సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ రహదారి గుండా గంపనపల్లి, బెజ్జాల, అబ్బాపూర్, అసల మాడ, దొడ్డిగూడెం, సుక్కుగూడెం, బీర్గూడెం, గంటలగూడెం, బొగడగూడెం, లచ్చుగూడెంతో పాటు పలు గూడెంల ప్రజలకు ప్రధాన రహదారి లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. లచ్చుగూడెంకు చెందిన రహదారి అకాల వర్షాలకు కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయని, దీంతో గ్రామస్థులు జీవన ఉపాధికి వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. విద్యా, వైద్యం, నిత్యావసర సరుకులకు వెళ్లేందుకు సైతం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోయారు. తక్షణమే అధికారులు స్పందించి హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. లేనియెడల బీజేపీ తరపున పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్, ఉపాధ్యక్షులు రేవెల్లి శ్రీనివాస్, కొండు రవి, ఎక్స్ వార్డ్ మెంబర్, బీజేపీ సీనియర్ నాయకులు ఉప్పుట్ల దుర్గా చరణ్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి అరికెల శంకర్, అడ్వాల సతీష్, ఆయా గూడాల గ్రామస్తులు పాల్గొన్నారు.

# 400 ఎకరాల పంట నష్టం

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** గత మూడు రోజుల నుంచి మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో దాదాపు 400 ఎకరాల పంటలకు నష్టం వాటిల్లిందని మండల వ్యవసాయ శాఖ అధికారిని కృష్ణవేణి విలేకరులకు తెలిపారు. మంగళవారం ఆమె మండలంలోని కడెం వాగు ప్రభావిత పంట పొలాలను క్షేత్ర స్థాయిలో పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించారు. మండలంలో వరద ప్రభావంతో పంటలకు తీవ్రంగా నష్టం జరిగిందని, సర్వే చేసి నివేదికను జిల్లా ఉన్నత అధికారులకు పంపించడం జరుగుతుందని తెలిపారు. ఆమె వెంట రైతులు, సిబ్బంది ఉన్నారు.

# మున్సిపల్ కమిషనర్ తనిఖీలు



**ఉద్యమ కెరటం, బెల్లంపల్లి:** బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ రమేష్ మంగళవారం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొంత మంది దుకాణదారులు 125 మైక్రాన్ల మందం కంటే తక్కువ మందం కవర్లను ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. నియమ నిబంధనలను ఉల్లంఘించిన 4 దుకాణదారులకు 15వేల జరిమానా విధించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వినియోగంతో పర్యావరణం దెబ్బ తింటుందని తెలిపారు. బెల్లంపల్లి పట్టణాన్ని కాలుష్య రహిత పట్టణంగా మార్చేందుకు అందరు సహకరించాలని కోరారు. ఈ తనిఖీలో పర్యావరణ ఇంజనీర్ సంతోష్, ఇంచార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్, ఉద్యోగులు పాల్గొన్నారు.

# పంట నష్టం వివరాల సేకరణ



**ఉద్యమ కేరటం, కౌటాల:** మండలంలో గత వారం కురిసిన వర్షాలకు వార్ధా, ప్రాణహిత నదికి వచ్చిన వరదతో నష్టపోయిన పంట పొలాలను మంగళవారం వ్యవసాయ అధికారి ప్రేమలత పరిశీలించారు. సాండ్గా, వీరవెల్లి, పర్ది, తాటిపెల్లి, బాలపెల్లి, మొగడ దగడ్ శివారులో గల 374 రైతులు 932 ఎకరాలు ముంపునకు గురైందని ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. పంటలను కాపాడుకోవడానికి రైతులకు తగు సూచనలు చేశారు. ఆమె వెంట ఏఈవోలు ఘనశ్యాం, కవిత, ఆదిత్య, సిద్దు, రైతులు ఉన్నారు.

# హెూటల్లో అగ్ని ప్రమాదం..

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని వాంకిడి గ్రామ బస్ స్టాండ్ సమీపంలో ఉన్న రాజస్థాన్ హెూటల్లో మంగళవారం రాత్రి ప్రమాదవశత్తు మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో కొద్దిపాటి నష్టం వాటిల్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మయూర్ అనే వ్యక్తి తన రాజస్థాని హెూటల్ ను రోజులాగేనే శుభ్రం చేసి షటర్ కు తాళం వేసి ఇంటికి వెళ్ళిపోయాడు. అయితే అనుకోకుండా మూసి ఉన్న హెూటల్లో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై యజమానికి సమాచారం అందించారు. షేటర్ తెరచి చూసేసరికి మంటలు వ్యాపించే క్రమంలో యువకులు వెంటనే మంటలను ఆర్పేయడంతో కొద్దిపాటి నష్టం వాటిల్లిందని స్థానికులు తెలిపారు. సంఘటన విద్యుత్ ఘాతమా.. లేదా దీపంతో జరిగిందా అనేది అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

